క్లుప్తంగా

సమ్మె విజయవంతం చేద్దాం

గుంతకల్లు: దేశ వ్యాప్తంగా ఈ నెల 9న నిర్వచే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దామని వివిధ కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాయలయంలో ఆదివారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రం 44 చట్టాలను 4 కోడ్‌లుగా మార్చి కార్మికులపై ఉక్కుపాదం మోపిందన్నారు. వివిధ సంఘాల నాయకులు సురేష్, మహేష్, రామదాసు, జిలాన్, దేవేంద్ర, రామాంజినేయుయాదవ్, మహబుబ్‌బాషా, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐటీ వింగ్ మండలాధ్యక్షుడిగా జగదీష్



మాజీ ఎమ్మెల్యే వైవీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: గుంతకల్లు మండల ఐటీ వింగ్ అధ్యక్షుడిగా పాతకొత్తచెరువు గ్రామానికి చెందిన కురువ జగదీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా జగదీష్, ఇతర కమిటీ సభ్యులు ఆదివారం మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతీరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

అన్నదానం గొప్పది

గుంతకల్లు: అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని వక్తలు అన్నారు. ఆదివారం పట్టణ లయన్స్ ఇంటర్‌నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రి వద్ద 300 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ పట్టణ అధ్యక్షుడు ఖాజా, కార్యదర్శి మహేష్‌రాజ్, కోశధికారి బాలాజీ, గుంతా రమేష్‌బాబు, రంగ, విజయభాస్కర్, కృష్ణ, బాబు, శ్రీధర్, మాధవ్ పాల్గొన్నారు.

వైభవంగా తొలి ఏకాదశి

- కిటకిటలాడిన ఆలయాలు
- మొక్కులు తీర్చుకున్న భక్తులు



తాడిపత్రి రూరల్: భూదేవి, శ్రీదేవి సమేత అలూరు కోన రంగనాథస్వామి



పెద్దపప్పూరు మండలం అశ్వర్థంలో నారాయణ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



పామిడిలో దేవతామూర్తుల ప్రాకారోత్సవ దృశ్యం

తాడిపత్రి రూరల్: తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం మండలంలోని వైష్ణవ దేవాలయాలు అధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. పట్టణంలోని లక్ష్మి చింతల వెంకటరమణస్వామి దేవాలయంతో పాటు మండలంలోని అలూరు కోన భూదేవి, శ్రీదేవి సమేత శ్రీరంగనాథస్వామి, ఓబులేసు కోనలో లక్ష్మీనరసింహ స్వామి, జంబులపాడులోని లక్ష్మి నరసింహస్వామి, చుక్కలూరులోని లక్ష్మి చెన్న కేశవస్వామి తదితర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను వేకువజామున ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వాములను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు

గుంతకల్లుటౌన్: తొలి ఏకాదశిని పురస్కరించుకుని పట్టణంలోని రాజేంద్రనగర్ ఉన్న వేంకటేశ్వరస్వామి అలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రంగయ్య, నారాయణస్వామి, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, కోశాధికారి సుధాకర్‌గుప్త, సభ్యులు జయంతి వెంకట్, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, వీరా, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేకపూజలతో పాటు విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి కృపాకర్, సభ్యులు వెంకట్, రాజారమణ, సోమనాథ్, చెన్నకేశవులు, సుబ్రమణ్యం, ప్రహ్లాద పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయం, మొళకతాళ్ల గ్రామంలోని అనంతగిరినాథస్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు రామాచార్యులు అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకార్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పెద్దపప్పూరు: ఏకాదశి సందర్భంగా ఆదివారం మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో వెలసిన అశ్వర్థనారాయణనుడిని దర్శించుకోవడాని అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు శింగరబట్లు, గణపతి,నారాయణ స్వామి, చక్రభీమలింగేశ్వరస్వామి, సుబ్రమణ్యేశ్వరులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పామిడి: పట్టణంలోని తగ్గుదేవాలయంలో ఉన్న అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి, పెద్దవితోబ, చిన్న వితోబ ఆలయాల్లో ఆదివారం తొలి ఏకాదశి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వాములను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



గుంతకల్లుటౌన్: వాసవీమాత ఆలయంలో విష్ణువు, లక్ష్మీదేవి



తాడిపత్రి రూరల్: భూదేవి, శ్రీదేవి సమేత చింతల వేంకటరమణస్వామి



గుంతకల్లుటౌన్: వేంకటేశ్వరస్వామి



పెద్దవడుగూరు: చెన్నకేశవస్వామి



గార్లదిన్నె: కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

రేపు వైఎస్సార్ జయంతి వేడుకలు



గుంతకల్లుటౌన్/శింగనమల/గార్లదిన్నె/నార్పల: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు మంగళవారం గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ గుంతకల్లు పట్టణ, మండల అధ్యక్షులు ఖలీల్, రాము తెలిపారు. మెయిన్‌రోడ్డు పాతబస్టాండ్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేయడంతో పాటు ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తామన్నారు.

- శింగనమలలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి మంగళవారం జయంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూల ప్రసాద్ తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త , మాజీ మంత్రి సాకే శైలజానాథ్ హాజరువుతారన్నారు.
- గార్లదిన్నెలో మంగళవారంమధ్యాహ్నం 3 గంటలకు దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ ఎల్లారెడ్డి తెలిపారు. సమన్వయకర్త డాక్టర్ శైలజానాథ్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.
- నార్పలలో మంగళవారం ఉదయం 10.00 గంటలకు జయంతి సందర్భంగా వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తామని మండల కన్వీనర్ ఖాదర్‌వలిఖాన్ తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త శైలజనాథ్ హాజరవుతారన్నారు.

ఆయా మండలాల్లోని జెడ్పీటీసీలు, ఎంపీపీ, వైస్‌ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో హాజరై వైఎస్సార్ జయంతిని జయప్రదం చేయాలని పార్టీ మండల కన్వీనర్లు కోరారు.

జగ్జీవన్‌రామ్ ఆశయాలను కొనసాగిస్తాం



గుంతకల్లులో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుంతకల్లుటౌన్/గుత్తి/పెద్దపప్పూరు: బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలను కొనసాగిస్తామని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఖలీల్, ఎస్సీసెల్ నియోజకవర్గం అధ్యక్షుడు వీరేష్ అన్నారు. ఆదివారం జగ్జీవన్‌రామ్ 39వ వర్ధంతి సందర్భంగా ఆర్‌అండ్‌బీ సర్కిల్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి బావన్న, పట్టణ అధ్యక్షుడు నల్లప్ప, దాసరిహరిబాబు, ఆర్‌డీజీ బాషా, ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు, బూత్‌కమిటీ పట్టణ అధ్యక్షుడు జన్నేమస్తాన్, పరుశరాముడు, పార్టీ అనుబంధ నియోజకవర్గాల అధ్యక్షులు పవన్, బాబూరావు, సూర్యారెడ్డి, నాయకులు చిన్నరాయుడు, అన్వర్,స్టాన్లీ, తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఎం, ఎమ్మార్పీఎస్ నాయకులు వేర్వేరుగా ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- గుత్తి పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో ఆదివారం బాబూ జగజ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అబూ బకర్, రామ్ మోహన్, అదనపు కార్యదర్శి జెన్నే కుళ్లాయిబాబు తదితరులు పాల్గొన్నారు.
- పెద్దపప్పూరు మండలకేంద్రంలోని ఆర్డీటీ కాలనీలో ఆదివారం బాబూ జగ్జీవన్ వర్ధంతి సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ ఆదినారాయణ, సీపీఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం తదితరులు జగ్జీవన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆదిమూర్తి, బాలనారాయణ, దివాకర్, లక్ష్మిదేవి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

జంతువులకు టీకాలు వేయించాలి

బుక్కరాయసముద్రం: పెంపుడు జంతువులుకు టీకాలు తప్పని సరిగా వేయించాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రత్నాకర్ సూచించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని పెంపుడు జంతువులకు టీకా వేయించే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ గోవిందరాజులు, రామాంజినేయులు, భాను ప్రకాష్, చంద్రశేఖర్, ప్రవీణ్, జమ్మన్న, చైతన్య శివయ్య, ఉపేంద్ర పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎంపిక

గుత్తి: ఎమ్మార్పీఎష్ మండక కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. పట్టణంలోని ఆర్ అండ్‌బీ బంగ్లాలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జ్ చిన్న సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు హర గోపాల్, జిల్లా నాయకుడు ఈరన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా గుత్తి మండల కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఓబులేసు, అధ్యక్షుడిగా రాజు, ఉపాధ్యక్షుడిగా రూపేష్, అధికార ప్రతినిధిగా సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా సునీల్, కార్యదర్శిగా రవీంద్ర, కోశాధికారిగా నాగేంద్ర బాబును ఎన్నుకున్నారు.

30 ఏళ్ల అనంతరం దిమ్మగుడిలో మొహర్రం

పెద్దవడుగూరు: జిల్లాలో అత్యంత సమస్యాత్మక ఫ్యాక్షన్ గ్రామమైన దిమ్మగుడి గ్రామంలో 30 ఏళ్ల తరువాత మొహర్రం వేడుకలను నిర్వహించడానికి పోలీసులు అనుమతులు ఇచ్చారు. దీంతో రెండు రోజులు క్రితం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మొహర్రం నిర్వహణకు ప్రధానమైన గుద్దిలి వేశారు. అప్పటి నుంచి పోలీసులు రోజూ గ్రామంలో పర్యటిస్తూ ఇరువర్గాల వారితో మాట్లాడుతూ సమన్వయం చేయడానికి ప్రయత్నాలు చేశారు. 1996లో గ్రామంలో మొహర్రం వేడుకల సందర్భంగా ఇరువర్గాల ఘర్షణలో పోలీసులు జరిపిన కాల్పుల్లో ఒకరు మృతి చెందారు. అప్పటి నుంచి పోలీసులు , గ్రామ పెద్దలు మొహర్రం నిర్వహణ నిలిపి వేశారు. ఈ ఏడాది గ్రామ పెద్దలు గ్రామంలో మొహర్రం వేడుకలను నిర్వహించాలని పోలీసులను ఆశ్రయించడంతో అనుమతులను మంజూరు చేశారు. ఎస్ఐ ఆంజనేయులు ఆదివారం గ్రామంలోని ప్రధాన రహదారి వెంట, పీర్ల చావిడి ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం కోసం గ్రామస్తులతో చర్చించారు.

గరుడ వాహనంపై రుక్మిణీ పాండురంగస్వామి

పామిడి: పట్టణంలో రుక్మిణీ పాండురంగస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు గరుడ వాహనంపై ఊరేగారు. రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలోదిండి భజనల నడుమ పాండురంగస్వామిని ఊరేగించారు.

వైద్య శిబిరాలకు స్పందన

గుంతకల్లు: స్థానిక భాగ్యనగర్‌లోని రామ భక్త ఆంజనేయస్వామి దేవాలయం కమిటీ, జేవీవీ ఆధ్వర్యంలో అనంతపురం కిమ్స్ సవేరా ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు నితీష్‌కుమార్ 100 మందికిపైగా రోగులను పరీక్షించి సలహాలు, సూచనలిచ్చారు. సీఐ మనోహర్, పోలేరమ్మ ఆలయ కమిటీ ధర్మకర్త మేస్త్రీ దొడ్డప్ప, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ యాదవ్, శ్రీరామ భక్త ఆంజినేయ స్వామి కమిటీ గురుస్వామి లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు టీజీ సురేష్, కార్యదర్శి నాగార్జున పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అనంతపురం ప్రభ్యాత్ డెంటల్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరంలో వైద్యులు అభిషేక్, ఇందూరాధ, మోబిసా మెయిన్ 120 మందికి దంత పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ వైస్ గవర్నర్ విరుపాక్షరెడ్డి, పామిడి లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు, వైద్యులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని లచ్చానుపల్లి శివారులో ఆదివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడి ఆంజనేయులు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. లచ్చానుపల్లికి చెందిన ఆంజనేయులు ద్విచక్ర వాహనంలో గుత్తికి బయలుదేరాడు. గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలిచారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

గుత్తిరూరల్: మండలంలోని టి.కొత్తపల్లి శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం రెండు లారీలు ఢీకొన్న ప్రమాదంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ ఖమరున్‌ఖాన్ గాయపడ్డాడు. అతడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా లారీని పక్కకు తొలగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

తాడిపత్రిటౌన్: పట్టణంలోని సుంకులమ్మపాలెంలో ఆదివారం రఫీ అనే వ్యక్తి అదే కాలనీకి చెందిన రఫీక్ అనే వ్యక్తిపై కత్తితో దాడికి తెగబడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రఫీ భార్యతో రఫీక్ అనుచితంగా ప్రవర్తించాడన్న కారణంగా దాడి చేయడంతో తల వెనుక రక్తగాయమైంది. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గూగూడులో గుండం వద్ద భక్తుల సందడి



గుత్తిలోని పగ్గాల పీర్ల మకాన్ వద్ద అగ్ని గుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

గూగూడులో వైభవంగా పెద్ద సరిగెత్తు

నార్పల: మండలంలోని గూగూడులో ఆదవారం పెద్ద సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. భక్తులు వేల సంఖ్యలో హాజరై కుళ్లాయిస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారి దర్శన భాగ్యం కోసం రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున వస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ సమీపంలో గాజుల దుకాణాలు, తినుబండారాల దుకాణాలు పెద్దఎత్తున వెలిశాయి. అలాగే జెయింట్ వీల్ వద్ద పిల్లలు, యువకులు సందడి చేశారు.

గుత్తి: గుత్తిలో పీర్ల పండుగ వేడుకల్లో భాగంగా ఆదివారం పెద్ద సరిగెత్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పగ్గాల పీర్ల మకాన్ వద్ద భక్తులు అగ్ని గుండ ప్రవేశం చేశారు. బారే హిమామ్ మకాన్ వద్ద భక్తులు సందడి నెలకొనింది. బండగేరి నుంచి వందలాది మంది పానకాలతో ఊరేగింపు నిర్వహించారు. బండగేరి నుంచి మెయిన్ బజారు గుండా బారే హిమామ్ మకాన్ వద్దకు చేరుకున్నారు. అక్కడ గుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం పానకాలను బారే హిమామ్ మకాన్‌లో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

యాడికి: మండల కేంద్రంతో పాటు మండలంలోని కోనుప్పలపాడు, నిట్టూరు, రాయలచెరువు, చందన, రామరాజుపల్లె, వేములపాడు, లక్షుంపల్లె గ్రామాల్లో పీర్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం పెద్ద సరిగెత్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. చందన మకాన్‌లోని పీర్ల స్వాములను ముజావర్లు ఖాజా హుసేన్, చాంద్ భాష, పెద్ద పీరు స్వామి, చిన్న పీరుస్వామి, బొడ్డుపీరు స్వాములతో పాటు మరో 10 పీర్ల స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పానకాన్ని అగ్ని గుండంలో పోయడంతోపాటు పీర్లకు చక్కెర చదివించి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. ట్రాక్టర్లుఎద్దుల బండ్లతో గ్రామస్తులు మకాన్ ఎదురుగా ఉన్న గుండంలోకి కట్టెలు, మొద్దులు వేసి వెలిగించారు. సీఐ ఈరన్న, ఎస్ఐ వెంకటరమణ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. అలాగే మండలంలోని చందనలో సోమవారం తెల్లవారుజామున 2 గంటలకు పెద్ద పీరు. చిన్నపీరు. బొడ్డుపీర్లను స్వాములను గ్రామోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం పీర్లను జలధికి తరలిస్తారు.

శింగనమల: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులు పీర్లకు మొక్కుబడులు చెల్లించారు. శింగనమలలోని 10 చావిడిలలోని పీర్లకు భక్తులు ప్రార్థన చేశారు. రాత్రికి 10 గంటలకు చావిడిల ముందు ఉన్న అగ్ని గుండాలను వెలిగించారు. సోమవారం జలధి కార్యక్రమం నిర్వహించనున్నారు.



యాడికి మండలం చందనలో అగ్ని గుండం వెలుగుతున్న దృశ్యం



శింగనమలలో వెండి పీరుకు మొక్కు బడులు తీసుకెళుతున్న భక్తులు